# మనిషిగా నిరసన




ఆ అరుగుమూల అలా చూసేటప్పటికి సూరిగాడి కళ్ళకి ఆకలేసింది. పెదాల మధ్య చీరచెంగు నొక్కిపట్టి..... ఆ చాటున జాకెట్టు వేసుకుంటోంది మల్లమ్మ. నడుస్తున్న వాడల్లా ఆగి మరీ చూశాడు సూరిగాడు.

జాకెట్టే కాదు, చీరె మార్చుకునేటప్పుడేనా అటు వచ్చీపోయే జనం పట్టిపట్టి చూసినా ఏమీ అనలేని బతుకు మల్లమ్మది. సొంత గుడిసెమాట వొదిలేసినా, కనీసం నాలుగుగోడల చాటుకేనా అద్దె డబ్బులిచ్చి బతకలేని అడుక్కునే బతుకు..... పాడుబడ్డ ఆ యింటి అరుగుమూలేనా దొరికినందుకు ఆనందిస్తున్న బతుకు....

అడుక్కునే వాళ్ళకి కూడా చిత్రమైన ఎథిక్స్ వుంటాయి. యింకా వాటినికాదని మల్లమ్మని ఆ

అరుగు మూల నుంచి తోసేసి ఆ స్థలాన్ని ఏ అడుక్కునేవాడూ ఆక్రమించలేదు. అందుకే ఆరునెలలుగా ఆ స్థలం మల్లమ్మ నివాసమైంది.

మల్లమ్మ జాకెట్టు వేసుకోవటం..... అలా వేసుకుంటున్నప్పటి కదలికలు మెరిసిన తెల్లటి వొంటి మెరుపులు అన్నీ చూశాడు సూరిగాడు. కడుపు నిండా సుష్టుగా భోంచేసి కిళ్ళీ వేసుకుని, సిగరెట్టు వెలిగించి అప్పటికి అయిదు నిమిషాలు కూడా కాలేదు. అలాంటి సుఖ సమయంలో ఆ అరుగు మూల అలా కనపడేటప్పటికి సూరిగాడికి ఆకలి గట్టిగానే వేసింది.

పక్షులన్నీ ఆహారం వెతుక్కుంటాయి. గద్ద మాత్రం ఆహారంతోపాటు, దాన్ని ఎగరేసుకుపోటానికి అనువు, ఆనూపానూ కూడా వెతుక్కుంటుంది. నిలబడిపోయిన సూరిగాడు కూడా గద్దలాగే ఆ అరుగుని పరీక్షగా చూశాడు.

కొంచెంసేపట్లోనే సూరిగాడికి చాలా సంగతులు గుర్తింపుకొచ్చాయి. గుడ్డిదైనా మల్లమ్మ మంచి బలంగా, చక్కగా బావుంది. ఆ అరుగు మీదున్న సరుకు చూస్తుంటే సంపాదన కూడా బాగానే వున్నట్టుంది. అదీకాక అక్కడున్న వస్తువుల్లో ఏ మగ సరుకూ లేదు. అందువల్ల మరే మగాడి తోడు లేనట్టుగానే వుంది. విషయమంతా వీలుగానే కనపట్టంతో కొంచెం హుషారొచ్చింది సూరిగాడికి. ఆ హుషారులోనే ఒక్కక్షణం సూరిగాడి చూపు ఆ అరుగు మీంచి మళ్ళింది.

సూరిగాడు తిరిగి అరుగువేపు చూసేటప్పటికి, పొట్టిగా, నల్లగా, చింతపిక్కలా వున్న కుర్రాడు మల్లమ్మతో ఏదో చెపుతూండటం కనపడింది.

"అమ్మా..... ఆడెవడో నిలబడి సూటిగా నీవేపే చూస్తున్నాడే...." అన్నాడు నాగేషు మల్లమ్మతో....

"పోనీలేరా.... చూసి, చూసి ఆడేపోతాడు...." అంది మల్లమ్మ.

మాటలు వినపడకపోయినా, ఆ కుర్రాడు తనవేపే చూసి మాట్లాట్టం వల్ల విషయం తన గురించే అయి వుంటుందనిపించింది సూరిగాడికి. యింక ఆలిశ్యం చెయ్యకూడదనుకున్నాడు. తిన్నగా అరుగువేపు నడిచాడు.

"అమ్మా.... యిటే వత్తున్నాడే...." అన్నాడు నాగేష్.

యీడెవడో, ఎందుకొస్తున్నాడో అని కొంచెం కలవరపడినా కదలకుండా మెదలకుండా అలాగే కూచుంది మల్లమ్మ.

"కొంచం నల్లగా వున్నా ముద్దుగా, అందంగా బలే వున్నావురా చిన్నోడా నీ పేరేంటి?" అన్నాడు అరుగు దగ్గరికొచ్చిన సూరిగాడు.

తల్లివేపు గుచ్చి గుచ్చి చూసినందుకు సూరిగాడి మీద కోపంగా వున్నా వాడి పొగడ్తకి కొంచం చల్లబడ్డాడు నాగేష్.. ఆ చల్లదనంతోటే.... "నాగేస్" అని బదులు చెప్పాడు.

"ఇదిగో... నీ పేరేంటో తెలియదు కానీ.... కుర్రాడు సూదంటు రాయిలా బలేగున్నాడు. నీ కొడుకేనా" అన్నాడు సూరి మల్లమ్మ నుద్దేశించి....

"అవును... ఏం?" అంది మల్లమ్మ.

"ఏం లేదు.... నేనూ మీలాంటోణ్ణే. నా పేరు సూరి.... పోతే మీ కన్నా కొంచెం క్లాస్.... యీమధ్య ఇక్కడ లేన్లే.... లేకపోతే ఎప్పుడో పరిచయం అయ్యుండేది.... యిప్పుడేనా కనిపించారు కదా..... మాటా మాటా కలుపుకుందామని...." అన్నాడు.

"మాటా కలపక్కర్లేదు..... మంచి సెడూ సూడక్కర్లేదు..... మర్యాదగా నీ దారిన నువ్వెళ్తే సాలు....' అంది మల్లమ్మ కరుగ్గా.....

మారు మాట్లాడుండా అక్కడ్నించి వెళ్ళిపోయాడు సూరిగాడు. వాడు వెళ్ళిపోతున్న అడుగుల చప్పుడు వినిపించింది మల్లమ్మకి. దానికితోడు నాగేష్.... "అమ్మా..... ఎల్లిపోతున్నాడే....." అన్నాడు. పోతేపోయాళ్ళే అనుకుంది మల్లమ్మ. అక్కడితో వాడి గొడవ మరిచిపోయింది. కానీ సూరిగాడు మరిచిపోలేదు. ఆ సాయంత్రం మల్లమ్మ అడుక్కునే చోటుకెళ్ళి పలకరించాడు.

కొంచం గేప్ వుండాలని రాత్రికి వొదిలేసి మర్నాడు మళ్ళీ పలకరించాడు. అన్నాలు తినేవేళకి వేడివేడి మాంసం కూర, రొట్టెలతో హాజరయ్యాడు. బలవంతం చేసి ఆ తల్లీ కొడుకు తినేలా చేశాడు. ఆ రాత్రి అరుగు దగ్గర చేరి ఆ కబురూ, యీ కబురూ చాలాసేపు చెప్పాడు. వో వారంలో మల్లమ్మకి చాలా కబుర్లు చెప్పాడు సూరిగాడు. వాటిలో చాలా నిజాలున్నాయి..... కొన్ని అబద్ధాలున్నాయి.... వాళ్ళ జీవితాలకి సంబంధించిన నీతి సూత్రాలున్నాయి.

కొంచం చనువైన దగ్గర్నించీ మల్లమ్మని మల్లీ అని పిలవటం మొదలెట్టాడు సూరిగాడు. ఆ వరసలోనే.....

"సూడు మల్లీ..... రోజులు సాలా సెడ్డగానే కాదు..... చాలా మొరటుగా వున్నాయి. నువ్వా గుడ్డిదానివి. పదేళ్ళ కుర్రాడు తప్ప ఏ తోడూ లేనిదానివి. ఒకడికి మరొకడు ఏం కాని రోజులొచ్చేస్తున్నాయి..... నువ్వు అడుక్కునే నాలుగు డబ్బులు. బలవంతంగా లాక్కుపోవటానికి యీళ్ళల్లో ఎవడేనా సాలు..... యిప్పటిదాకా అలా జరగలేదంటే రోజులు బావున్నాయి.... రోజులు మారితే సాలా కట్టం..... తల్లికి కొడుకు, అన్నకి తమ్ముడు కాని రోజులివి. యింక పక్కనోళ్ళకి వచ్చే కష్టం గురించి పట్టించుకునే దెవరు..... యింతకీ నేను చెప్పేది.... నీకోతోడు కావాలి.... నీ మీద అభిమానంతో దగ్గరికొచ్చాను.... కాదనుకోకు.....నేలేనప్పుడు ఎవర్నేనా అడుగు.... కావాలంటే నాగేసునే అడుగు..... నేనెలాగుంటానో..... ఏ కన్నొంకరా, కాలొంకరా లేనోణ్ణి.... నిజం చెప్పాలంటే నీకన్నా సక్కనోణ్ణి....." అన్నాడు.

ఆ మాటలకి మల్లమ్మ మెత్తబడింది. కానీ ఏం బదులు చెప్పలేదు. అప్పుడు సూరిగాడు.... "మల్లీ యీ మాట జాగ్రత్తగా యిను.... యీ రోజుల్లో ఒక్కటే బంధుత్వం యింకా సెడిపోకుండా మిగిలింది..... వొళ్ళు వొళ్ళు కలిసే బంధం..... దాని పవరు మాత్రం దానిదే..... అందుకే యింతగా అడుగుతున్నా..... ఇంకా నీ కిట్టం లేదంటే సెప్పేయి..... మళ్ళీ నీ దగ్గరికి రమ్మన్నా రాను...." అన్నాడు.

వారంరోజులు టైము, సూరిగాడి మాటలు..... వాటి వెనక మల్లమ్మ గుడ్డి బతుకు బెరుకు..... అవసరం..... మొత్తానికి సూరిగాడికి లొంగిపోయింది మల్లమ్మ.

మరోవారం గడిచింది. పగలంతా ఎక్కడ తిరిగినా రాత్రయ్యేటప్పటికి మల్లమ్మ దగ్గర హాజరైపోతున్నాడు సూరిగాడు. మల్లమ్మ శారీరకంగా సూరిగాడికి ఎప్పుడో లొంగిపోయినా పూర్తిగా మనసుతోపాటు లొంగిపోయిన రాత్రి ఒకటుంది. అది ఆ రాత్రి.

★ ★ ★

ఆ రాత్రి....

పదకొండింటికి 'రా-రా' అని ప్రయాణం చేశాడు మల్లమ్మని సూరిగాడు.

''ఎక్కడికీ....'' అంది మల్లమ్మ.

''సెపుతారా.... యివాళ మనకి మంచి పర్స్ తగిలింది. యివాళంతా మనిద్దరికీ హుషారే'' అన్నాడు. జేబులు కొట్టటం చిల్లర మల్లర దొంగతనాలు చెయ్యటం సూరిగాడి వృత్తని అప్పటికే తెలిసిపోయింది మల్లమ్మకి.

''యింత రాత్రి ప్రయాణం కట్టావు. మరి నాగేసో'' అంది మల్లమ్మ.

''ఆడు పడుకునుంటాళ్ళే..... మనోళ్ళకెవరికేనా చెప్పి ఎల్దాం..... సూత్తుండమని....'' అన్నాడు.

సెకెండ్ హేండ్ బజార్లో కొనుక్కొచ్చిన కొత్తచీర కట్టించాడు మల్లమ్మ చేత..... అలాగే కొత్తజాకెట్టు తొడిగించాడు. అంతకుముందే వో చీప్ లాడ్జిలో రూము కుదుర్చుకొచ్చాడు.

ఆ రాత్రి..... వొంటి మీద చిరుగుల్లేని చీర జాకెట్టు.... లాడ్జి రూము...., నాలుగు గోడల చాటు..... మంచం చప్పుడు..... పేరుపు, దిండు మెత్తదనం.... అంతా అనూహ్యమైన కొత్త అనుభవం మల్లమ్మకి..... గుడ్డికళ్ళతో నిరుపయోగమైన కనురెప్పల్తో.... ఆ రాత్రిని..... ఆ రాత్రిలోని ప్రతి నిముషాన్ని అందమైన కలలా అనుభవిస్తూ గడిపింది మల్లమ్మ.

సూరిగాడు కూడా తన నేర్పుని, వోర్పుని, అనుభవాన్ని రంగరించి మల్లమ్మని ఎంతగా బులిపించి మురిపించాలో అంతగానూ మురిపించాడు. మల్లమ్మకి కళ్ళులేవని, చూడలేదని బాగా గుర్తు పెట్టుకున్నాడు సూరిగాడు. అందుకే ప్రతి అనుభవాన్ని మాటల్లోకి మార్చి చక్కటి ధ్వనిని తనలోంచి మల్లమ్మకి సరఫరా చేశాడు.

అంతవరకూ చీకటి కూడు తిన్నట్లున్న అనుభవం ఆ రాత్రి వెన్నెల భోజనంలా వుంది యిద్దరికీ. అంత అపురూపమైంది కాకపోయినా వాళ్ళ బతుకులకి అందుబాట్లోలేని నాలుగుగోడల చాటు చిన్నసైజు స్వర్గంలా వుంది.

అంతే ఆ రాత్రి తెల్లారేటప్పటికి..... మల్లమ్మ మనసు పూర్తిగా మారిపోయింది. నిస్సందేహంగా సూరిగాడు తనకి దొరికిన నిధి అనుకుంది. వాడే కనుక తన జీవితంలోకి రాకపోతే ఎంతటి స్వర్గం చేయి జారిపోయి వుండేదో అనిపించింది. ఏదో పుణ్యం వల్ల అయాచితంగా తనకి లభించిన దేవుడు సూరిగాడనుకుంది.

వొంటి సుఖం ఒక్కటే కాదు మల్లమ్మ మనసుని అలా మార్చింది. ఏమాత్రం ఆదరణ, ఆప్యాయత ఎరగని ఆమె గుడ్డి జీవితం. దానికితోడు సూరిగాడు లాలించాడు..... బుజ్జగించాడు..... మురిపించాడు..... అంతకుముందు ఎవరూ మల్లమ్మకి అటువంటి అనుభవం, తృప్తి యివ్వలేదు సరిగదా..... భయంకరమైన నరకాన్ని యిచ్చారు. వయసు వచ్చీ రాగానే.... ఎవరో ఏమిటో తెలియని మనిషి వో రాత్రి బలవంతంగా ఆడదాన్ని చేశాడు.... అలాగే మరొకడు తల్లిని చేశాడు.... అలాంటి అనుభవాల్నించి, పిచ్చికుక్కల్లాంటి మగాళ్ళ నుంచి తప్పించుకోటమే బతుకైపోయింది..... అలాంటి బతుకులో, చీకట్లో..... సూరిగాడు ఆ రాత్రి వెలుగు వర్షం కురిపించాడు. ఆ వర్షంలో ఓ ఆడది..... ఆర్ద్రత, వయసు వున్న ఆడది..... అందులో గుడ్డిది..... వొదిగిపోవటం..... పూర్తిగా లొంగిపోవటం చిత్రమేం కాదు.

మర్నాడు అరుగు చేరుకున్నాక..... సూరిగాడు వెళ్ళిపోయాక..... గత పదిహేను రోజులుగా ఎప్పుడూ అడగంది మల్లమ్మ నాగేసుని..... ''వొరేయ్..... సూరి ఎలాగుంటాడ్రా చూట్టానికి....'' అని అడిగింది.

మల్లమ్మే కాదు. సూరిగాడికి నాగేషూ లొంగిపోయాడు ఎప్పుడో..... అందుకే తల్లి అడిగిందే తడవుగా రకరకాలుగా వర్ణించి చెప్పాడు సూరిగాడి అందం నాగేష్ మల్లమ్మకి.

అన్నీ వింది మల్లమ్మ.

విని మళ్ళీ అడిగింది.

అలాగే అడిగి అడిగి వొకటికి రెండుసార్లు నాగేష్ చేత చెప్పించుకుని విని ముసిముసి నవ్వుల్తో మురిసిపోయింది.

★ ★ ★

ఏ రకమైన తేడా లేకుండా మారిపోయింది సూరిగాడి విషయంలో మల్లమ్మ. తనకి సర్వస్వం వాడే అనుకునే స్థాయికి వచ్చేసింది.

సూరిగాడి సంపాదన నికరం కాదని తెలుసు. అందుకే తను అడుక్కొచ్చిన డబ్బుతో వాడికి తిండితిప్పలు చూట్టం ఏ మాత్రం యిబ్బంది అనుకోలేదు మల్లమ్మ.

రోజులు సాఫీగా, కులాసాగా గడుస్తున్నాయి. అప్పుడప్పుడు చేతివాటం ఫలించినప్పుడు అదనపు హుషారు సమకూరుస్తున్నాడు సూరిగాడు. వో రోజు అలా హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నప్పుడే మల్లమ్మ నడిగాడు సూరిగాడు.

"ఏం మల్లీ ..... నాగేసుని ఏం చేద్దాం అనుకుంటున్నావు....." అని.

"ఏం చెయ్యటమేంటి?" అంది మల్లి.

"అదే వాడి ముందు బతుగ్గురించి...."

"ఏముంది.... నేనేం చెయ్యగలన్చెప్పు..... యిలాగే నలుగుర్ని నాలుగు డబ్బులడుక్కుని బతకమని వొదిలెయ్యటం తప్ప...." అంది మల్లమ్మ కొంచెం దిగులుగా.

"ఏడిసినట్టుంది.... ఎప్పటికి ఆడి బతుకు యిలాగే గడిసిపోద్దనుకుంటున్నావేమో.... అది కల్ల.... యిప్పుడంటే పసోడు ముద్దుముద్దుగా వున్నాడు..... జాలేసి అందరూ ధర్మం చేస్తున్నారు. ఆడు పెద్దయితే లావుగా పోతులా అన్తాడు.... ఎవడూ పైసా ధర్మం చెయ్యరు.... యిదే వయసు.... ఆణ్ణి నాకొదిలేయి..... నా బిజినెస్‌లో పెట్టేత్తా....." అన్నాడు సూరిగాడు.

మల్లమ్మ..... మల్లమ్మ సంపాదనా వుపయోగపడుతున్నాయి. యింక నాగేసు మాత్రం తనకెందుకువ ఉపయోగపడకూడదన్న లెవల్‌కి చేరాయి సూరిగాడి ఆలోచనలు.

"ఏంటి దొంగబతుకా.... వొద్దొద్దు.... పోలీసులు.... జైళ్ళు.... బయం.....అ బతుకొద్దు..... ఆడ్నిలాగే అడుక్కుని బతకనీ...." అంది మల్లమ్మ.

"ఏమవుద్దీ. పోలీసులు.... జైళ్ళు... అయితే ఏంటి..... మేమందరం బతకటంలా.... పైగా కులాసాగా బతుకుతున్నాం..... ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టు యీ అడుక్కునే బతుక్కన్నా అదెంతో నయం..... బతుక్కి కులాసా, హుషారు వుంటది. అయినా ఎనక నేను లేను.... ఆడికి ఏదేనా అయితే కాసుకోనూ.....'
' అన్నాడు.

వెంటనే వొప్పుకోకపోయినా మల్లమ్మ మరికాస్సేపటికి వొప్పుకుంది. ఎప్పుడో లొంగిపోయిన మల్లమ్మని యీ విషయంలోనూ లొంగదీశాడు సూరిగాడు.

సూరిగాడు చెప్పినట్టు వింటే కొడుకు బతుకు కులాసాగా గడుస్తుందన్న ఆశతో వొప్పుకుంది మల్లమ్మ తల్లి మనసు.

ఏ గొడవ జరిగినా, పోలీసులు పట్టుకున్నా తను అడ్డు నిలబడతానని సూరిగాడు అభయం యిచ్చాకే వొప్పుకుంది. సూరిగాడి పరిచయం వల్ల.... చుట్టూ ఒకణ్ణొకడు దోచుకు తినే జీవితం వల్ల దొంగతనం తప్పన్న అభిప్రాయం అంతకుముందే తుడిచిపెట్టుకుపోయింది మల్లమ్మలో....

మల్లమ్మ వొప్పుకున్నాక నాగేసుకి ట్రైనింగ్ యివ్వటం మొదలెట్టాడు సూరిగాడు. 'యిది యిలా..... అది అలారా సిష్యా.....' అని తర్ఫీదిచ్చాడు.

అనుమానం రాకుండా స్కూలు కుర్రాళ్ళా కనిపించటానికి కాకీ నిక్కరు కాకీ చొక్కా కుట్టించాడు నాగేష్‌కి.

నాగేష్ వో పెద్దమనిషి పర్స్ కొట్టేసి మొదటి దొంగతనం చేసిన రోజు మల్లమ్మ, సూరిగాడు, నాగేష్ పెద్ద విజయంలా పండగ చేసుకున్నారు.

జీవితం మరింత కులాసాగా మారింది. సూరిగాడో, నాగేషో ఏదో ఒకటి కొట్టుకొచ్చిన రోజు మరింత హుషారుగా వుంటోంది. బతుక్కి అంతకన్నా యింకేం అక్ఖర్లేదనుకుంది మల్లమ్మ.

కానీ సూరిగాడు మాత్రం అలా అనుకోలేదు. వాడికి ఆకలి వేస్తూనే వుంది..... ఎక్కడెక్కడో ఎవరో కనపడుతూనే వున్నారు. స్థిరంగా వుండకుండా ఎగరటానికి అలవాటుపడ్డ బతుకు..... మళ్ళీ వో ఎగురు ఎగరాలని వుంది ఆ అరుగు, గుడ్డి మల్లమ్మ వొళ్ళు పాతగా అనిపిస్తున్నాయి.

అలాంటి సమయంలో వాడి గద్ద కళ్ళకి వో ఆశ కనపడింది. నెమ్మదిగా పథకం వేశాడు.

బజారు మొదట్లో కొత్తగా వెలిసిన వో జనరల్ స్టోర్ వుంది. షోకేసులు, అద్దాలు మంచి హంగుగా పెట్టారు. గల్లా పెట్టి కూడా పాతకొట్లలా కాకుండా..... షాపు లోపలికి వెళ్ళేచోటే కేష్ కౌంటర్ కట్టించాడు. కౌంటర్ లోపలివేపు వెళ్ళాలంటే చిన్న చెక్కతలుపు పైకెత్తుకుని వెళ్ళాలి. షాపు ఎప్పుడూ రద్దీగా వుంటుంది. సాయంత్రంపూట మరీనూ. అదీగాక షాపతనికి వచ్చిన పెద్దనోట్లని ఎప్పటికప్పుడు బొత్తిలా పెట్టి క్లిప్పులో పెట్టటం అలవాటు. ఒక్కసారి ఆ కట్ట చేతికి అందితే అయిదారువేలకి తక్కువుండదు.

యివన్నీ పరికించి ప్లాన్ వేశాడు సూరిగాడు. మంచి రద్దీ టైములో నాగేష్ తను షాప్‌లోకి వెడతారు.... ఎవరూ చూడని సమయంలో కేష్ కౌంటర్ చెక్కకిందకి దూరిపోతాడు నాగేష్. వాడికి అడ్డుగా తను నిలబట్టం.... అదను చూసి కాలితో వాణ్ణి అదలించగానే వాడు అలాగే కూచుని కేష్ డ్రాయర్లోకి చేయి చాచి క్లిప్ అందుకోటం...., అంతే డబ్బు తమ సొంతం.....

ఆ షాప్, కేష్ డ్రాయర్.... పొజిషన్స్ నాగేష్‌కి ఒకటికి రెండుసార్లు చెప్పి వోరోజు సాయంత్రం ఆ దొంగతనానికి ముహూర్తం పెట్టాడు సూరిగాడు.

★ ★ ★

అనుకున్నట్టే ఆ సాయంత్రం దొంగతనానికి వెళ్ళారు. కానీ దొంగతనం చెయ్యలేదు. సరిగ్గా నాగేష్ డబ్బు కట్ట పట్టుకున్న క్షణంలోనే షాపతను నాగేష్ చెయ్యి పట్టుకున్నాడు.

నిమిషాల మీద పోలీసులొచ్చారు.

'కుర్రవెధవ వేలుడులేదు... ఎంత పెద్ద ప్రయత్నమో....'

'అబ్బే వీడి వెనక వేరే జనం వుంటారండి.... ఒక్కడే ఏం చేస్తాడు....'

'ఏమయినా.... యింత చిన్నవయసులో... వీడింతకి తెగించాడంటే బతుకెంత దారుణంగా వుందో చూశారా...'

అందరూ తలోమాటా అన్నారు.

యివేవీ వినకుండానే అక్కడ్నించి ఎప్పుడో జారుకున్నాడు సూరిగాడు. అప్పుడు అక్కడుండటం బిజినెస్ థియిరీ కాదు.

నాగేష్‌కి చెప్పాల్సిన జాగ్రత్తలన్నీ పెట్టాల్సిన భయాలన్నీ - వృత్తిలోకి దింపుతూ - తన శిష్యుడిగా మార్చుకున్ననాడే పెట్టేశాడు. ఒకవేళ పోలీసులు పట్టుకున్నా, తన్నినా, భయపెట్టినా, నోరు మెదపకూడదని, ఏ వివరం, ఎవరి పేరు చెప్పకూడదని గట్టిగానే చెప్పాడు. పోతే నాగేష్ ఆ మాటకి కట్టుబడి వుండేలా సూరిగాడు పెట్టిన భయం ఒక్కటే..... నాగేష్ నోరు విప్పితే మరుక్షణం తల్లిని చంపేస్తానని...... తల్లి తప్ప నాగేష్‌కి యీ ప్రపంచంలో మరింకేం లేదని సూరిగాడికి తెలుసు.

నాగేష్‌ని పోలీసులు తీసికెళ్ళిన వో గంటకి మందు కొట్టేసి రాత్రి అరుగు దగ్గరికి వచ్చాడు సూరిగాడు. పథకం దెబ్బ తిన్నందుకు కొంచం చిరాగ్గానే వుంది.

వచ్చిన మరికాస్సేపటికి జరిగిన విషయం నెమ్మదిగా మల్లమ్మ చెవిన వేశాడు.

ఆ వార్త విని గుండెలు బాదుకుని ఏడ్చింది మల్లమ్మ.

"వూరుకో గట్టిగా అరిచి ఏడవకు.. వింటే పోలీసులు మన్నీ పట్టుకెడతారు...." అన్నాడు.

అయినా మల్లమ్మ వూరుకోలేదు. ఏడుస్తూనే వుంది. ఏడుస్తూనే "అణ్ణి వొదిలేసి నువ్వొక్కడివీ వచ్చేశావా" అంది.

"ఏం చెయ్యను చెప్పు.... విడిపించాలని అన్నిరకాలుగా చూశా!.... కానీ కుదర్లేదు. ఒకటి రెండురోజుల్లో విడిపిస్తాగా...." అన్నాడు.

మల్లమ్మ వూరుకోలేదు.... మరింతగా ఏడ్చింది. "అసలు నీ మూలాన్నే యిదంతా జరిగింది..... వొద్దంటుంటే యిందులోకి దింపావు.... ఏదేనా వస్తే అడ్డు నిలబడి ఆదుకుంటానన్నావు.... పసోణ్ణి ఒక్కణ్ణి వదిలేసి వచ్చావు...." అని సూరిగాడి మీద యింతెత్తు లేచింది.

అది చూసి సూరిగాడు అరిచాడు. "ఏంటా అరుపులు. అణ్ణి పోలీసులు పట్టుకుంటే నాకేమేనా సరదా ఏంటి. ఎక్కడా పట్టుబడకుండా అయీ యియీ తెచ్చినప్పుడు హుషారుగా గడపలే. పండగ చేసుకోలే.... అలాగే యిప్పుడు కష్టమొచ్చినప్పుడూ తట్టుకోవాలి....." అన్నాడు పడుకుంటూ....

మల్లమ్మ మనసు వికలమైపోయింది. జైల్లో నాగేసు ఎలా వున్నాడో.... వొదుల్తారో.... వొదల్రో.... చితకతంతున్నారేమో.... గట్టిగా పైకి ఏడవలేక..... మనసులోనే 'అమ్మా..... అమ్మా' అని ఏడుస్తున్నాడేమో.... పరిపరివిధాల పోయింది మల్లమ్మ మనసు. తిండీ తిప్పల్లేకుండా అలాగే కూకుంది.

మరో రెండు గంటలకి సూరిని నిద్రలేపే ప్రయత్నం చేసింది. ఎలాగేనా వాణ్ణి బతిమాలి పోలీసు స్టేషన్‌కి పంపాలనుకుంది. తాగొచ్చి పడుకున్న సూరిగాడు లేవలేదు. నిద్ర మెలుకువొచ్చీ లేవలేదు.

ఆ రాత్రి నరకయాతనగా గడిచింది మల్లమ్మకి. తెల్లారుతూనే లేచాడు సూరిగాడు. ఏ కళనున్నాడో మల్లమ్మని వోదార్చాడు. వెళ్ళి నాగేసు సంగతి చూసొస్తానని వెళ్ళాడు.

అరుగు కదలకుండా - వెళ్ళిన సూరిగాడికోసం ఎదురు చూస్తూనే కూచుంది మల్లమ్మ.

సాయంత్రానికి మంచి హుషారుగా వచ్చాడు సూరిగాడు. వచ్చి "మల్లీ.... మరింకేం బయం

లేదు..... నేనంతా తెలుసుకున్నా..... మన నాగేస్ బంగారం అనుకో.... పోలీసోళ్ళు ఎంతడిగినా మనెవరి పేర్లు సెప్పలేదంట.... అడిగి అడిగి విసుగొచ్చి ఆళ్ళే వొదిలేస్తారు...... సొమ్ము పోలేదుగా కేసుండదు.... పైగా పసోడని కొంచం జాలుంటది.... పోతే కొద్దిగా చెయి చేసుకున్నారు.... అయినా ఆడేం లొంగలేదు..... రేపో ఎల్లుండో వచ్చేస్తాడు మన నాగేసు....'' అన్నాడు.

మల్లమ్మకి అంతా అయోమయంగా వుంది. సూరిగాడు తన వెంట తీసుకొస్తాడనుకున్న కొడుకు రాలేదు. మల్లమ్మ నోటమాట రాలేదు.

రాత్రి దాకా మల్లమ్మకి ఎంతగా ధైర్యం చెప్పాలో అంతగానూ చెప్పాడు సూరిగాడు. ఆ రాత్రి మందు, మంచి తిండి పట్టుకొచ్చాడు. ''బాధ తగ్గుద్ది తాగు'' అని బలవంతంగా తాగించాడు. మల్లమ్మకి మాట్లాడే అవకాశం యివ్వకుండా అన్నీ తానే మాట్లాడాడు.

''యిలాంటి విషయాల్లో కంగారు పడకూడదన్నాడు. యిాటిల్లో ఏది ఎలా చెయ్యాలో థియరీ వుంటుందన్నాడు. తనుగానీ, మల్లమ్మగానీ పోలీసుల దగ్గరకెడితే కేసు మోపవుతుందన్నాడు. యిలాంటి ఒకటి రెండు దెబ్బలు తగలకపోతే నాగేసు రాటు తేలడన్నాడు.... అంతా అన్నాక..... ఏం జరగలేదనుకొని సుఖంగా పడుకోమన్నాడు. అన్నీ తన కొదిలేయమన్నాడు.

ఏం చెయ్యాలో తెలియక, ఏం చెయ్యలేక మల్లమ్మ బాధపడుతూనే వుంది.

దెబ్బలకు తట్టుకోలేక తల్లి ప్రేమ కూడ మరిచిపోయి నాగేష్ పోలీసులకి తన పేరు ఎక్కడ చెపుతాడో నన్న ఆందోళన అంతకు ముందు రాత్రి వుంది సూరిగాడికి. కానీ ఆ రాత్రి ఆ ఆందోళన లేదు. అందుకే అర్థరాత్రి మల్లమ్మని వొదలకుండా దగ్గరికి లాక్కున్నాడు.

మల్లమ్మకి అనుభవం పాతదే అయినా, అనుభూతి వేరుగా వుంది. తన వొళ్ళంతా శవంలా మారిపోయినట్టుంది. ఆ సమయంలో కూడా ఆ గుడ్డితల్లి మనసు నాగేష్ మీదే వుంది.

ఆ రాత్రి తెల్లారేక యింక వుండబట్టలేకపోయింది మల్లమ్మ. సూరిగాడిని నిలేసి అడిగింది. ''ఏం జరిగితే అదే జరుగుతుంది.... పోలీస్ స్టేషన్‌కి వెడదాం నడు....'' అంది.

''మతేం లేదేంటి.... కేసు మోపవుద్దంటే యినవే.... చిన్న కుర్రోడి కేసు పెద్దోళ్ళ కేసులా మారుద్ది'' అన్నాడు.

''అయినాసరే ఎలదాం నడు.....'' అంది మల్లమ్మ గట్టిగా.

''నేరాను.....'' అన్నాడు సూరిగాడు అంతకన్నా గట్టిగా.

''సరే అయితే..... నేనే ఎలతా.....'' అంది మల్లమ్మ.

ఎళ్ళినా ఏం వుపయోగం లేదని..... ఎళ్ళొద్దని ఎన్నోరకాలుగా చెప్పాడు. అయినా మల్లమ్మ వినలేదు..... చివరికి..... ''నువ్వెడితే యింక నీకూ నాకూ యింతే..... మళ్ళీ మనం కలిసేది లేదు..... గుర్తెట్టుకో.....'' అన్నాడు.

సూరిగాడికి పంతంగా వుంది. ఓ గుడ్డిదానికి, అందులో తన మగతనానికి లొంగిందానికి యింత పట్టేమిటని పంతంగా వుంది. అందుకే నీకు నేనుండనన్న ఆ ఆఖరి అస్త్రం ప్రయోగించాడు. అదీగాక నాగేష్‌గాడి కోసం పోలీసుల ముందరపడి గొడవలు తెచ్చుకోటం సూరిగాడికి ఏమాత్రం యిష్టంలేదు.

సూరిగాడు అలా అన్నా మల్లమ్మ పెద్దగా ఆలోచించలేదు. ముందుకి నడిచింది. పోలీస్ స్టేషన్‌కి చేరేవరకూ ఆరాటంగానే వుంది. కుర్రాడు తెలియక చేశాడని పోలీసోళ్ళని బతిమాలుకుంది.... వాళ్ళు

ఎన్ని తిట్టినా భరించింది.... వాళ్ళకి ఏమేం కావాలంటే అవన్నీ వొప్పుకుంది. మొత్తానికి నాగేష్‌ని విడిపించుకుంది.

పోలీసులు వాణ్ణి వొదలగానే వాడి వొళ్లంతా తడిమి చూసింది. కొన్నిచోట్ల వాతలు తేలున్నాయి.... కొన్ని చోట్ల కమురు దెబ్బలున్నాయి, వాడి వొళ్ళు కళ్ళకి కనపడకపోయినా పొర్లిపొర్లి ఏడ్చింది మల్లమ్మ.

నాగేష్‌ని తీసుకుని తిరిగి వస్తుంటే వాడు చెప్పిన విషయాలు వింటుంటే తన గుడ్డి బతుకులోటు మరింతగా తెలిసొచ్చింది మల్లమ్మకి.

ఒంటరి అరుగు.... ఒంటరి అరుగు ఆ రాత్రి మరింత ఒంటరిగా తోచింది మల్లమ్మకి. సూరిగాడి పరిచయం.... వాడిచ్చిన అనుభవం.... కొన్నాళ్ళైనా అందమైన కలలా గడిచిన జీవితం..... అన్నీ గుర్తొచ్చాయి మల్లమ్మకి.

సూరిగాడేమిటి లోకమంతా తనలాటి బలంలేనోళ్ళని దోచుకు తింటూనే వుంది..... నాగేష్‌గాడు ఎలాగా బైటపడ్డాడుగా. అయిపోయిందేదో అయిపోయింది.... పోనీ మళ్ళీ సూరిగాడ్ని పిలిచి చేరదీస్తేనో - అనుకుంది ఓ క్షణం. ఆ క్షణంలో వెయ్యి సుఖాలు స్ఫురించాయి.

అదే క్షణంలో పక్కన తన చేతిలోనే వున్న నాగేష్ చెయ్యి స్పర్శా స్ఫురించింది.

"ఛీ.... మళ్ళీ తను సూరిగాడ్ని పిలవటమా...." అనుకుంది మల్లమ్మ వెంటనే.....

రెండు నెలలు కూడబెట్టుకున్న డబ్బు, తన సుఖం, తన శరీరం అన్నింటినీ పణంగా పెట్టినా..... పక్కన కొడుకుని, కొడుకు చేరువని సాధించుకున్నందుకు చిత్రమైన గర్వం అనిపించింది మల్లమ్మకి.

• *స్వాతి మాసపత్రిక డిసెంబర్ 1982 (కథల పోటీలో ప్రథమ బహుమతి)*

• *ఇదయం చిరుకథ (తమిళం) 1-3-1986*